క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న వైద్యులు

చీపురుపల్లి: పట్టణంలోని మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రిక్షాకాలనీలో సోమవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో 55 మందికి నేత్ర వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 22 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి విజయనగరం తరలించారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు, సభ్యుడు మజ్జి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడు



వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రమణ,తదితరులు

చీపురుపల్లి: దేశానికి గొప్ప సంపదగా నిలిచిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసాల స్మారకోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 129 సంవత్సరాల క్రితం చికాగోలో స్వామి వివేకానంద చేసిన సర్వమత సమ్మేళన ప్రసంగం ఇప్పటికే ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సనాతన ధర్మం కోసం ఆయన చేసిన ప్రసంగం ప్రపంచానికి ఇప్పటికీ గుర్తుందన్నారు. భారతదేశంలో స్వామి వివేకానంద జన్మించడం గర్వకారణమన్నారు. యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలన్నారు.


రూ.42 లక్షలతో నాడు-నేడు పనులు



మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో రూ.42 లక్షలతో చేపడుతున్న నాడు–నేడు పనులను ఎంఈఓ బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. పాఠశాలలో కొత్తగా టాయిలెట్స్ నిర్మాణం, అవసరమైన భవనాలకు మరమ్మతులు, తరగతి గదుల్లో టైల్స్ ఏర్పాటు, విద్యుద్దీకరణ, ఫర్నీచర్, పెయింట్స్ వేయించడం, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నట్లు హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు ఎంఈఓకు వివరించారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయని హెచ్‌ఎం చెప్పారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ సూచించారు. ఆయన వెంట సీఆర్పీ రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పంచాయతీలతోనే అభివృద్ధి



నినాదాలు చేస్తున్న భీమారావు, దళితులు

గుర్ల: దళితవాడలు అభివృద్ధి చెందాలంటే వాటిని ప్రత్యేక పంచాయతీలు చేయాల్సిన అవసరం ఉందని అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఎయిమ్) జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు అన్నారు. మండలంలోని కోటగండ్రేడులో ఎస్సీ యువతతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎస్సీ కాలనీల అభివృద్ధికి, దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలు చేసేంత వరకు యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చక్కగా చదువు కుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎయిమ్ మండల అధ్యక్షుడు తలే నారాయణప్పుడు, సభ్యులు మరడాన ఈశ్వరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

వేపాడ: అర్హులందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వావిలపాడు గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి అన్నారు. పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు పథకాలు, ప్రభుత్వసేవలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు.. చట్టానికి, రాజ్యాంగానికి అతీతుడేం కాదు

- కోర్టు తీర్పు న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచింది
- గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మెంటాడ(గజపతినగరం రూరల్): విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మెంటాడ(గజపతినగరం రూరల్): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజ్యాంగానికి, చట్టానికి అతీతమేమీ కాదని, ప్రజలందరికీ వర్తించే చట్టం, రాజ్యాంగమే ఆయనకూ వర్తిస్తాయని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుతో సామాన్యులకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగిందని అన్నారు. ఇప్పటి వరకూ చంద్రబాబు తన పలుకుబడిని ఉపయోగించుకుని కోర్టులను, వ్యవస్థలను మేనేజ్‌చేసి తప్పించుకు తిరిగారన్నారు. తప్పు చేస్తే చట్టం ప్రకారం ఎవరికైనా శిక్ష తప్పదని అన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరిట ప్రజాధనం దోపిడీ చేయడం వల్లే చంద్రబాబును అరెస్ట్ చేశారే తప్ప, ఇందులో ప్రభుత్వ కక్ష సాధింపు ఏమీ లేదని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బూడి వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

ఇది ప్రజా విజయం



ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టు రాష్ట్ర ప్రజల విజయమని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కక్ష రాజకీయాలు తమ ప్రభుత్వ లక్ష్యం కాదని, తప్పు చేయబట్టే చంద్రబాబు అరెస్టు అయ్యారని తెలిపారు. స్కిల్ కుంభకోణంలో వందల కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు కొల్లగొట్టారని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆయన నిజస్వరూపం తెలిసిందని పేర్కొన్నారు. ఇటీవలే రూ.118 కోట్లకు సంబంధించి ఐటీ శాఖ ఆయకు నోటీసులు ఇచ్చిందని, అమరావతి భూముల కుంభకోణం, ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, టిడ్కో ఇళ్ల స్కామ్ ఇలా.. ఆయన స్కామ్‌లకు అంతేలేదని వివరించారు. చంద్రబాబు అరెస్టును సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అంటగట్టాలని చూడటం అవివేకమని పేర్కొన్నారు.

చంద్రబాబు బండారం బయట పడింది



జైహింద్‌కుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు

గంట్యాడ: చంద్రబాబు పెద్ద మోసగాడని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ విమర్శించారు. మండలంలోని రామవరం గ్రామంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ కుంభకోణంతో చంద్రబాబు బండారం బయట పడిందని అన్నారు. చంద్రబాబు ఎన్నో కుంభకోణాలు చేశారని, అనేక కేసుల్లో స్టేలు తెచ్చుకుని కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాపం ఎట్టకేలకు పండిందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తామని చెప్పి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు.

ఉపాధి పనుల ఆడిట్‌పై ప్రజావేదిక



ప్రజావేదికలో పనుల వివరాలను సభకు వివరిస్తున్న ఆడిట్ బృందం

చీపురుపల్లి: మండలంలోని 19 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పంచాయతీల్లో సామాజిక తనిఖీ పూర్తయ్యింది. ఆడిట్ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీడీలు వై.లక్ష్మణరావు, శారద ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామాల్లో చేసిన 1,220 పనులకు సంబంధించి గుర్తించిన అంశాలను ఆడిట్ బృందం చదివి వినిపించిన అంశాలను అధికారులు రికార్డుల్లో పరిశీలించారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ మాట్లాడుతూ సామాజిక తనిఖీలు చేపట్టడం వల్ల ఉపాధి పనులు పారదర్శకంగా జరుగుతాయని అన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పనులు జరిపించేందుకు సామాజిక తనిఖీ అస్త్రం లాంటిందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఏపీఓలు భాగ్యలక్ష్మి, నాగేషు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలి



ఎస్.కోట కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలు, పోలీసుల లాఠీచార్జిలు, తిరగబడే ఘటనలను నివారించేందుకు తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలో న్యాయవాదులపై పోలీసులు జరిపిన లాఠీ చార్జిని నిరసిస్తూ ఎస్.కోట న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యూ.నరసింహశర్మ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, ఇదే ధోరణి కొనసాగితే న్యాయవ్యవస్థ కూడా రౌడీలు, గూండాల చేతుల్లోకి పోయే ప్రమాదం ఉందన్నారు. సుప్రీంకోర్టు, రాష్ట్రహైకోర్టులతో పాటు అఖిలభారత, రాష్ట్ర బార్‌అసోసియేషన్‌ల న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలన్నారు. న్యాయవాదులు జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, వారాది నాగేశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, ఎం.చంద్రశేఖర్, బి.వి.ఎస్.రామారావు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, ఎం.అప్పారావు, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, బోని శేఖర్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్సీ సీట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సు అందుబాటులో ఉందని, సీటు కావాలనుకునే విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీసెట్–2023లో అర్హత సాధించిన వారు తమ కళాశాల వెబ్‌సైట్ నందు వివరాలను ఈ నెల 12 నుంచి 20 మధ్య రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో 30 సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ కోసం కళాశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

మట్టి వినాయకులనే పూజించాలి



జేసీ మయూర అశోక్‌కు మట్టి వినాయకుడ్ని అందజేస్తున్న స్పార్క్ సొసైటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్పార్క్ సొసైటీ ప్రతినిధులు భవానీ పద్మనాభం, మేకా అనంతలక్ష్మి, పొట్నూరు శిరీష కోరారు. ఈ మేరకు జేసీ మయూర అశోక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రంగు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మల నిమజ్జనం వల్ల నీటి కాలుష్యం పెరిగి, జల జీవరాశులకు తీవ్ర హాని కలుగుతుందన్నారు. చెరువుల పరిరక్షణకు అందరూ మట్టిబొమ్మలే వాడాలని కోరారు.

ఫైబర్‌నెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

పూసపాటిరేగ: ఫైబర్‌నెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఎంపీడీఓ రాధికకు ఫిర్యాదు చేశారు. ప్రజలకు ఎప్పటికప్పుడు విజ్ఞానం, వినోదం అందిస్తున్న ఫైబర్ నెట్‌వర్క్ ప్రసారాలు సక్రమంగా ఇవ్వకుండా ఆపరేటర్ ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు



జామి: సర్వేపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్

బొండపల్లి: మండలంలో ఈనెల15వ తేదీ నుంచి ఇంటింట జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు వైద్యసిబ్బందికి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయాల ఏఎన్‌ఎంలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఏఎన్‌ఎంలు వలంటీర్లతో కలిసి వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. అనారోగ్య సమస్యలున్నవారిని గుర్తించి, గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలకు వారిని తీసుకువెళ్లి వైద్య వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని, ఇంకా మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జామి: మండలంలో ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్ అన్నారు. జామి సచివాలయంలో వలంటీర్లకు సర్వేపై సోమవారం అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలతో కలిసి ప్రజల ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరానికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు తీసుకోవాలన్నారు. సచివాలయ కార్యదర్శి నారాయణమూర్తి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం..

నెల్లిమర్ల: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గల జరజాపుపేట శ్రీ వేంకటేశ్వర మురళీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత రాకుండా, పౌష్టికాహార లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చిన్నారులకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. అనంతరం పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సీడీపీఓ ప్రసన్న మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, ఏఎంసీ డైరెక్టర్ పోలుబోతు నారాయణమూర్తి, కౌన్సిలర్స్ నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పొంద్రంకి సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు మాత సంధ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్త సేకరణ బుట్టలను ప్రజాప్రతినిధులకు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లి: పంచాయతీరాజ్ విభాగం నుంచి మండలంలోని పంచాయతీలకు కేటాయించిన చెత్త సేకరణ బుట్టలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. మండలంలోని 19 పంచాయతీలకు 25,900 చెత్త సేకరణ బుట్టలు వచ్చాయన్నారు. ప్రతీ పంచాయతీలో ఇంటింటికీ రెండు చొప్పున బుట్టలు అందజేయాలని సూచించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. చెత్తను కాలువలు, వీధుల్లో పారబోయవద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు పంచాయతీల సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, సర్పంచ్‌లు బాణాన శ్రీనివాసరావు, రఘుమండ త్రినాథ్, పోలరాజ్, చందక గురునాయుడు, మీసాల రమణ, అధికార్ల శ్రీనుబాబు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా సదుపాయం



బీమా నమోదుపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు

దత్తిరాజేరు: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నియమించిన గృహసారథులకు పార్టీ తరఫున ఉచిత బీమా సదుపాయం కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ కడుబండి రమేష్ నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గెదేల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన మండలంలోని సచివాలయాల కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. గృహసారథుల పేరిట బీమా చేయించడంపై సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పించారు. రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతీ గృహసారథి పేరును బీమా కోసం నమోదు చేయించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఒమ్మిడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గరివిడి అథ్లెట్లు



చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడాకారులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు



గంట్యాడ: పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ నాయుడుతాత

చీపురుపల్లిరూరల్(గరివిడి): జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో గరివిడి మండలానికి చెందిన అథ్లెట్లు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో ఈ నెల 9,10వ తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో గరివిడి మండలం కుమరాంపాలవలసకు చెందిన సిరియాల భవానీప్రసాద్ డిస్కస్‌త్రో పోటీల్లో ప్రథమస్థానం, 5 కిలోమీటర్ల పరుగుపందెంలో జి.దుర్గాప్రసాద్ ద్వితీయస్థానం, రేస్‌వాక్‌లో వై.మహేష్ ద్వితీయస్థానం, జమ్ముసాంబశివ షాట్‌పుట్‌లో ప్రథమ, డిస్కస్‌త్రోలో ద్వితీయస్థానంలో నిలిచారు. కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన రేణుక 3 కిలోమీటర్ల పరుగుపందెంలో, గంగాధర్ 5 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరంతా ఈనెల 21 నుంచి 23 వరకు ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో క్రీడాకారులను జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు యడ్ల అప్పారావు సోమవారం అభినందించారు. కొండపాలెం పంచాయతీ వార్డు మెంబర్ కింతాడ కిరణ్‌కుమార్,అథ్లెట్ పిసిని సత్తిబాబు పాల్గొన్నారు.

రేస్ వాకింగ్‌లో ప్రథమస్థానం

చీపురుపల్లి మండలం ,జి.ములగాం గ్రామానికి చెందిన దుక్క శ్రీరాము పదివేల మీటర్ల రేస్ వాకింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే పర్ల గ్రామానికి చెందిన సరస్వతి షాట్‌పుట్‌లో తృతీయస్థానం సాధించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు పి.ఎం.పాలెం విద్యార్థులు

గంట్యాడ: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అండర్–14, 16, 18, 20,22 కేటగిరీల్లో మండలంలోని పెదమజ్జిపాలెం సూర్య అకాడమీ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. విజయనగరంలోని విజ్జి స్టేడియంలో ఈనెల 9వతేదీన నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని గాయత్రి (షార్ట్‌పుట్), పిల్ల కవిత(హైజంప్, లాంగ్ జంప్), దాసరి రేవతి(800 మీటర్ల రన్నింగ్)కె.వెంకటేష్ (హైజంప్), సాలాపు హరికృష్ణ(800 మీటర్ల రన్నింగ్), రవ్వ పవన్ కుమార్(జావెలిన్ త్రో) పోటీల్లో సత్తా చాటారు. వీరు ఈనెల 21,22,23వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను గ్రామ సర్పంచ్ నాయుడుతాత, వైస్ సర్పంచ్ గోవింద్ నాయుడు సోమవారం అభినందించారు.

ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు



మాట్లాడుతున్న జిల్లా మానసిక వైద్యనిపుణురాలు మౌనిక తేజశ్విని

బొండపల్లి: క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుని, ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని జిల్లా మానసిక వైద్య నిపుణురాలు మౌనిక తేజశ్విని అన్నారు. సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు పలు అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలకే చాలా మంది మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యేవారు తక్షణ సలహాలు,సూచనల కోసం జాతీయ టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించాలని సూచించారు. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. అటువంటి వారి కోసం ప్రత్యేకంగా అవగాహన సదస్సులతో పాటు,వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఝాన్సీ, ఈఓ అప్పలనాయుడు, యూడీసీ నారాయణరావు, కేజీబీవీ ఎస్ఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న గ్రామీణ వైద్యులు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గ్రామీణ వైద్యుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. గ్రామీణ వైద్యుల సంఘ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గ్రామీణ వైద్యుల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలమని తెలిపారు. గ్రామీణ వైద్యుల సంఘం 30 మందితో ప్రారంభించామని, ప్రస్తుతం 2 వేల మంది సభ్యులయ్యారని చెప్పారు. ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు రెండో విడత ప్రారంభం



మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడలో మిషన్ ఇంద్రధనుస్సు రెండో విడత కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా.. గర్భిణులకు ధనుర్వాతం రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తామన్నారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు జరగబోయే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి అచ్యుతరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ, సిబ్బంది చంద్రశేఖర్, సత్తిరాజు, ఆర్‌వీ రమణ, ఎం. సత్యవతి, రత్నకుమారి, వేదమణి, తదితరులు పాల్గొన్నారు.